నగరంలోని ఓ ఖరీదైన ఏసీ హోటల్‌లో దర్శకుడు నిర్మాతల మధ్య ఓ రోజు ఇలా సంభాషణ జరిగింది

''దర్శక మహాశయా! ప్రజలంతా కొత్తదనం కోరుకుంటున్నారు. కొత్తతరం కోసం ఎదురు చూస్తున్నారు. మనల్ని అందరూ మరచిపోయినట్లున్నారు. మీ మేధస్సుకు పదునుపెట్టి తిరుగులేని, ఎదురులేని విపరీతంగా రేటింగ్ పెరిగే ఒక కథ చెప్పండి'' అన్నాడు నిర్మాత.

దర్శకుడు నవ్వి, ''అయ్యా! ఒక సస్పెన్స్ కం క్రైం థ్రిల్లింగ్ కథ రెడీగా ఉంది. వింటారా'' అంటూ లాప్‌టాప్ తెరిచాడు.

నిర్మాత కథ విని ఎగిరి గంతేశాడు. 'మటాష్...ఈ దెబ్బతో మిగతా సీరియళ్లన్నీ మటాష్. ఎవరి నోట విన్నా, ఏ ఇంట్లో చూసినా ఈ కథే వినిపిస్తుంది. ఎన్నేళ్లయినా సాగదీద్దాం. మనకు తెలిసిన, మనం చూసిన మలుపులు, విరుపులు అన్నీపెట్టేద్దాం'' అన్నాడు నిర్మాత.

# రణనినాదం అను 7 ఎపిసోడ్ల కథ

## - పెద్దింటి అశోక్ కుమార్

షూటింగ్ మొదలైంది. సీరియల్ ఏడు ఎపిసోడ్‌లు పూర్తయింది. ఈ విషయం స్పాన్సర్లకు తెలిసింది. నిర్మాత దర్శకుల ప్రతిభ మీద అపారమైన నమ్మకం ఉన్నవాళ్లు, పలుకు మీద గౌరవం ఉన్నవాళ్లు పోటీ పడి ఒప్పుకున్నారు. సీరియల్‌ను తొందరగా మొదలు పెట్టమని మొరపెట్టుకున్నారు.

ఒకవైపు షూటింగ్ జరుగుతోంది. ఒకవైపు సీరియల్ మొదలైంది. కథలో మలుపులు చెబుతూ పత్రికల్లో, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడంతో జనమంతా ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్నారు.

**ఎపిసోడ్-1**

కన్నీళ్లుపెట్టించే టైటిల్ సాంగ్. నాలుగే పాత్రలు. మిగతావన్నీ గెస్ట్‌రోల్స్. లో బడ్జెట్

కోట్ల మంది చూస్తున్నారు. రేటింగ్‌చూసి యాజమాన్యం నోరు తెరిచింది.

మొదలే పెళ్లి చూపుల సీన్. పల్లెటూరి అమ్మాయి. పట్నవాసపు అబ్బాయి. అమ్మాయి తల వంచుకు కూర్చుంది. అమ్మాయి తండ్రి భయం భయంగా దిక్కులు చూస్తున్నాడు. తల్లి వంటింట్లో హడావిడిగా ఉంది. అబ్బాయి లాల్చీ పైజామాలో ఉన్నాడు. అబ్బాయి తల్లి అమ్మాయిని, ఇంటిని మార్చిమార్చి చూస్తోంది. (మనసులో) ''ఇల్లు బాగుంది. అమ్మాయి ఒంటిమీద నగలు బాగున్నాయి. కనిపిస్తున్న ఆస్తే ఇంత ఉంటే కనిపించనిది మరెంత ఉందో...ఎలాగైనా ఈ సంబంధం కుదుర్చుకోవాలి''

ఈ మాటలు ప్రేక్షకులు వింటున్నారు. బీపీ,షుగర్ పెంచుకుంటు న్నారు.

వెంటనే స్వల్ప విరామం.

స్పాన్సర్లు వస్తువులతో ప్రత్యక్షం.

పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. బీడీలు మానండి. సిగరెట్లు తాగండి. బీడీ కట్టలపై ఆడుతున్న పుర్రెబొమ్మ

సీరియల్ స్టార్ట్. అమ్మాయి కందిపోయే బుగ్గలతో తలపైకెత్తింది. అబ్బాయి సల్మాన్‌ఖాన్. మనసులోనే పొంగిపోయింది. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. ముడివడి విడివడలేక విడివడ్డాయి. దర్శకుడు ఆ సీన్‌ను అద్భుతంగా చిత్రీకరించాడు. అమ్మాయి గిలగిలకొట్టుకుంటూ తలదించుకుంది. అబ్బాయి (మనుసులో) 'వెర్రి మాలోకంలా ఉంది. నగలన్నీ ఒరిజనల్‌లాగే ఉన్నాయి. ఒడ్డాణం అమ్మితే పాత బాకీలు ఫట్. మెడలోగొలుసు తీస్తే ఫ్రెండ్స్‌కు మంచి పార్టీ. ఈ ఇల్లు నాదే. ఆ ఒళ్లు నాదే..థాంక్ గాడ్'

పాత్రలకు కాకుండా ప్రేక్షకులకు మాత్రమే వినిపించే మాటలు.

అబ్బాయి తండ్రి దిక్కులు చూస్తున్నాడు. చూస్తూ చూస్తూ (మనసులో) 'ఈ వెధవను ఒప్పించాలి. పెళ్లయ్యేవరకైనా వెధవ పనులు మాన్పించాలి. స్థితిమంతుల్లా ఉన్నారు. ఒప్పుకుంటారో! లేదో!. ఒప్పుకుంటే మాత్రం నా సామిరంగా.. చివరి రక్తం బొట్టు పీల్చుకునే వరకు ఎంజాయ్ చెయ్యవచ్చు'.

మళ్లీ స్వల్ప విరామం.

స్పాన్సర్లు రెడీ. కత్తుల్లాంటి కలాలతో ఈటెల్లాంటి మాటలు. వ్యభిచారం నేరం. అన్‌వాంటెడ్ పిల్స్, నిరోధ్ వాడండి. ఎయిడ్స్‌ను నిరోధించండి.

సీరియల్ మళ్లీ స్టార్ట్. ఒప్పందాలు జరుగుతున్నాయి. కట్న కానుకలు మాట్లాడుకుంటున్నారు.

''ఒక్క కూతురండీ.అంతో ఇంతో ఉన్నవాళ్లమే. ఆస్తులన్నీ అమ్మాయి పేరనే ఉన్నాయి. నా ఆస్తంతా తనదే కదండీ'' అమ్మాయి తండ్రి అమాయకంగా.

పైకి అబ్బాయి నవ్వుతున్నాడు. (మనసులో) 'అంతా తెలుసు. తెలిసే వచ్చాం. తెలియనిదల్లా మాగురించి మీకే' అనుకున్నాడు.



అమ్మాయి తల్లిదండ్రులు గుసగుసలాడుకుంటు న్నారు. ఆ గుసగుసలు కూడా ప్రేక్షకులకు వినిపిస్తు న్నాయి.

''మనమ్మాయి అదృష్టవంతురాలు. మంచి సంబంధం దొరికింది'' అని తల్లి.

''అంతా దేవుని దయ'' తండ్రి

ప్రేక్షకులు ''వద్దు..వద్దు...' అని మొత్తుకుం టూనే ఉన్నారు. వారి ప్రమేయం ఏమీ లేకుండానే పెళ్లి జరిగింది. అత్త,మామ,భర్త, ఆమె ఇంట్లోనే తిష్ఠ వేశారు. ప్రేక్షకుల మాటలు దర్శక నిర్మాతలు వింటున్నారు. తీవ్రమైన ఉత్కంఠ. విపరీతమైన రేటింగ్. దర్శకుడు హాపీ. నిర్మాత హాపీ. స్పాన్సర్లు మరీ హాపీ.

***ఎపిసోడ్-2***

అత్త వేధింపులు,మామ సూటిపోటీ మాటలు. అమ్మాయి కాఫీ కప్పుతో బెడ్ రూంలోకి అడుగుపె ట్టింది. భర్త గురక తీస్తున్నాడు. అతడిని సున్ని తంగా నిద్రలేపి 'చాయ్' అంది అమ్మాయి.

అబ్బాయి విసుగ్గా చూస్తూ 'దరిద్రం మొహం నువ్వూనూ....టీ అనరాదు' అన్నాడు

అమ్మాయి నవ్వులు పెదవుల మీదనే చిదిమి వేయబడ్డాయి. క్లోజప్‌లో ఆమె మొహం రెండు మూడుసార్లు ముందుకు వెనక్కు.. రొటీన్‌గా స్మాల్ బ్రేక్. బ్రేక్ తర్వాత...

'తీసుకో..'అమ్మాయి.

'చూశారా..చూశారా..ఇన్నేళ్ల కాపురంలో ఎప్పు డైనా మిమ్మల్ని అలా ఏకవచనంలో సంబోధిం చానా? భర్తంటే కించిత్ గౌరవం కూడా లేదు. డబ్బున్న పిల్లనని గర్వం. మనమంటే చిన్నచూపు' అప్పుడే అక్కడికి వచ్చిన అత్తగారు భర్తకు ఫిర్యాదు చేసింది.

ప్రేక్షకులు చాలా హర్ట్. అయ్యో పాపం గర్వమె క్కడిదని సింపతి.ఆమె కష్టాలను చూసి కన్నీళ్లు.

పిల్లిలాంటి మామగారు పులిలా ముందుకొ చ్చారు. 'అవునే.. మనవాడు వట్టి చవట కాబట్టే గదా.. ఇది ఇలా రెచ్చిపోతోంది.' అన్నాడు భార్యతో.

''నేనేం చవటను కాదు తెలుసా..'అన్నాడు కొడుకు

ప్రేక్షకులకు మాత్రమే కనిపించే విధంగా తండ్రి సైగ చేశాడు. తల్లి క్రూరంగా నవ్వింది. కొడుకు చేతి లోని కప్పు పైకి లేచింది.

'అయ్యో..వద్దు..వద్దు...అన్యాయం..అక్రమం' అంటూ ప్రేక్షకుల గగ్గోలు.

వారిని మరింత క్షోభకు గురిచేస్తూ అమ్మాయి అమాయకంగా ''చాయ్ బాగుందా..నేనే చేసిన'' అంది.

''నీ మొహంలా ఉంది'' అంటూ ఆమె పైకి విసి రికొట్టాడు.

అమ్మాయి మొహం నిండా వేడివేడి టీ. కళ్లల్లో నీళ్లు. ముగ్గురూ నవ్వుతున్నారు. మళ్లీ బ్రేక్. రీఓపె న్‌లో లాంగ్ షాట్. బట్టల గుట్టల ముందు అమ్మాయి. ఆయాసపడుతూ బట్టలు ఉతుకు తోంది. అత్తా మామ భర్త ఏదో కుట్ర చేస్తున్నారు. ఈ సారి మాటలు ప్రేక్షకులకు కూడా వినిపిం చడం లేదు. భర్త మొహం విషపు నవ్వుతో క్లోజ్‌షాట్

ఏమవుతుందోనని ప్రేక్షకుల హైటెన్షన్. హైరే టింగ్. దర్శకుడు ఖుషీ. నిర్మాత ఖుషీఖుషీ. స్పాన్సర్లు మరింతగా ఖుషీ.


***ఎపిసోడ్-3***

అత్తామామ భర్త దీర్ఘాలోచనలో ఉన్నారు. అమ్మాయి స్టోర్ రూంలో ఒక మూలన ఉంది. చుట్టూ దుమ్ముపట్టిన పాత సామాన్లు. మొహం అతిదీనంగా ఉంది. పుట్టినింటి నుండి తనతో తెచ్చుకున్న చెక్కబొమ్మలను ఏరుకుంటోంది. ఉమ్మితో తడి చేసి వాటిని తుడుచుకుంటోంది. ఇత్తడి తాంబూలం, తవుకు, మాణిక్యాలు, చెంబు ఇంకా వస్తువులు దుమ్ముకొట్టుకుని పడి ఉన్నాయి.

''చంపేస్తే పోలా...ఆస్తంతా మనకే అవు తుంది'' మామ అంటున్నాడు.

'అయ్యో..అయ్యో..చంపేస్తారట పాపం వద్దు వద్దు' ప్రేక్షకులు

అత్త నవ్వింది. కొడుకు చెవిలో ఏదో చెప్పింది. కొడుకు నవ్వుతూ తలూపాడు.



ప్రేక్షకుల్లో టెన్షన్. ఏం చెప్పింది...? ఏం జరగ బోతుంది? ఆమె బతకాలి. గెలవాలి. సాధించాలి. ఈ మోసం చేసే మనుషులతో ఆమె ఉండకూడదు. రొటీన్‌గా షార్ట్ బ్రేక్. ఊపిరి బిగపట్టిన ప్రేక్షకుల ఉచ్ఛ్వాశ నిశ్వాసాల్లో నాగుపాము బుసలు.

కొడుకు కాఫీ కప్పుతో స్టోర్ రూంలోకి నడి చాడు. క్లోజప్‌లో కాఫీ పచ్చగా మెరుస్తోంది. అత డిని చూసి ఉలిక్కిపడింది. కింద పడ్డ మొక్కజొన్న గింజలను ఏరుతున్నట్లు నటించింది. ఆమె మనసు తెలిసిన వాడిలా బొమ్మలను బట్టతో తుడిచాడు. వాటిని ముద్దాడాడు. కాఫీ కప్పు ఆమె చేతికిచ్చాడు. ఆమె నమ్మలేక పోతోంది. చెంపల్ని నిమిరి ముక్కును పిండి వీపును తడిమి కాఫీ తాగించాడు.

ప్రేక్షకులు టెన్షన్ తట్టుకోలేకపోతున్నారు. 'తాగొద్దు..తాగొద్దు...' అని అరుస్తున్నారు. ఆమెకు వినిపించ లేదు. తాగడం పూర్తికానే లేదు. వెక్కిళ్లు మొదలయ్యాయి.

అదను చూసి బ్రేక్.

కోట్ల కళ్లు తెరకు అలా అతుక్కుపోయాయి. రీఓ పెన్‌లో వంటింట్లో హడావిడి. వెక్కిళ్లతో ఆయాస పడుతున్న భార్యకు నీళ్లను అందిస్తున్నాడు భర్త. అత్త మామలు గాబరా పడిపోతున్నారు. కొద్దిసే పట్లో ఆమె తేరుకుంది.

''నువ్వు నా బంగారు బాతువు. దురాశకు పోయి చంపుకోము గదా'' ప్రేక్షకులకు చెప్పింది అత్త. చావు తప్పినందుకు అందరూ ఉపిరి పీల్చుకు న్నారు. సీన్ కట్‌చేస్తే బెడ్ రూంలో.

భార్యాభర్తలు ఇద్దరే ఉన్నారు. భర్త గారాలు పోతున్నాడు. భార్య అన్ని మరచి మురిపాలు పంచుతుంది. అతడు ఆమెను పొగుడుతున్నాడు. భుజాల మీద తిప్పుతున్నాడు. ఏమిటా అని ప్రేక్ష కులకు అయోమయం. అతడి చేతిలో పెన్నూ పేపర్.

''నీది నాది కాదా? నా బతుకు నీది కాదా...ఇ ద్దరం ఒక్కటి కాదా...ఆ ఎర్ర చెలుక నేలలు ఏం చేస్తున్నాయి. అమ్మి పెద్ద ఫ్యాక్టరీ పెడదాం. చిన్న సంతకం పెట్టుచాలు. పెద్ద కంపెనీకి నిన్ను ఓనర్‌ను చేస్తాను.'' అతడు అంటున్నాడు.

'ఓహో..ఇదా నీ ప్లాన్..'అనుకున్నారు ప్రేక్ష కులు.

అమ్మాయి పాత్ర కదిలపోయింది. కరిగిపో యింది. పెన్ను కాయితం చేతిలోకి తీసుకుంది.

ప్రేక్షకుల్లో మళ్లీ ఆందోళన. 'వద్దు...మోసం. నీ సంపదను ఆక్రమిస్తున్నాడు. మాటలు నమ్మకు. మోసపోకు' అని. తీగను సాగదీసి సాగదీసి చిన్నగా మీటినట్టు తరువాయి భాగం రేపు. జనంలో చర్చలు. కోపం. సానుభూతి. దిగంతాలు వినబడేలా అరుస్తున్నారు. పాత్రలకు వినిపించడం లేదు. అవి ప్రాణంతో ఉండవు కదా! రేటింగ్‌లో కొలిచే డైరెక్టర్, నిర్మాత, స్పాన్సర్లు మాత్రం వింటు న్నారు. పాత్రధారులు కూడా ప్రేక్షకులను ఓ కంట కనిపెడుతున్నారు. పాచిక పారుతున్నందుకు బహుత్ ఖుషీ. ప్రేక్షకులు ఏం ఆలోచిస్తున్నారో

తెలుసుకుని దానికి విరుద్ధంగా కథను నడపాలనుకుంటున్నారు. అవసరమైనప్పుడు మలుపు. ఆపాలనుకున్నప్పుడే ఫుల్‌స్టాప్. కోర్టులో బంతి.

**ఎపిసోడ్-4**

ఆమె పెన్ను తీసుకుంది.పేపర్ తీసుకుంది. మెల్లిగా తలెత్తి ''నా నగలన్నీ ఏం చేశావ్? నేను చూడు ఆకురాలిన చెట్టులా ఎలా ఉన్నానో'' అంది.

''ఓస్ అదెంత పని.వచ్చే లాభాలతో ముందుగా నీకు నగలే కొనిపెడతాను సరేనా?'' అన్నాడు. హఠాత్తుగా ఆమె కళ్లు గోగుపూలు,మొహం కందగడ్డ. కాళ్లు చేతులు కోపంతో బిగుసుకు పోయాయి. నరనరాన రక్తం ప్రవాహంలా పొంగుతోంది.

ప్రేక్షకుల్లో ఉత్కంఠ. ఆమె పేపర్‌ను పరపరా చింపి అతని మొహాన విసిరికొట్టింది. పెన్నును రెండు ముక్కలు చేసింది. చూపుడు వేలితో చూపిస్తూ..''ఫో..బయటకు'' అని గద్దించింది.

ప్రేక్షకులు బహుత్ కుష్..పాత్రతో మమేకమై వాళ్లు కూడా అరిచారు. వాళ్లను వెళ్లిపొమ్మని గొంతెత్తి నినాదాలిచ్చారు. ముగ్గురూ అప్పటికప్పుడు తోకముడిచారు. పనిలోపనిగా స్మాల్ బ్రేక్. సేమ్ షాట్‌తో రీఓపెన్.

''ఎక్కడికే..వాణ్ని వెళ్లి పొమ్మంటున్నావు..?'' బయట నుంచి అత్త పరుగెత్తుకు వచ్చింది.

''ఇది నా ఇల్లు..నా స్వంతం...మీరు ఒక్కక్షణం ఇక్కడ ఉండడానికి వీల్లేదు.'' అమ్మాయి గట్టిగా అరిచింది.

''అమ్మా!నువ్వు పొమ్మంటే పోవడానికి, రమ్మంటే రావడానికి నీ ఇంట్లో పనిమనుషులమనుకున్నావా? నీదంటూ ఏమీ లేదిప్పుడు. అంతా మాదై పోయిందిగా'' విషపు నవ్వుతో మామ పరుగెత్తుకొచ్చాడు. ముగ్గురికి వాగ్వాదం. ఆమె ఓడిపోతుంది. ప్రేక్షకులు గొంతు విప్పి అరుస్తున్నారు. ఆమె గెలుస్తుంది. ప్రేక్షకులు ఆనందిస్తున్నారు. పాత్ర కోట్ల మంది ప్రేక్షకులదయింది. ఇప్పుడొక స్మాల్‌బ్రేక్

తిరిగి స్క్రీన్‌మీదికి వస్తే..ఆమెతో బలవంతంగా సంతకం పెట్టించాలని చూశారు. ఆమె వినలేదు. పెనుగులాడింది. గదిలో బంధించి బలవంతంగా సంతకం పెట్టించారు.

ప్రేక్షకులు అశ్రునయనాలతో రేపటి కోసం ఎదురు చూస్తున్నారు.

**ఎపిసోడ్స్ -5,6**

నాలుగు ఎపిసోడ్‌లతో ప్రేక్షకులను గుప్పిట్లోకి తీసుకున్నాడు డైరెక్టర్. కావాలనుకున్నప్పుడు ఏడిపిస్తున్నాడు. కోపం వచ్చినప్పుడు గుండెల్ని పిండేస్తున్నాడు. అప్పుడప్పుడు నవ్విస్తున్నాడు. అప్పటికప్పుడు బేలని చేస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు ముగ్ధను చేస్తున్నాడు. ఏమీ తోచనప్పుడు ఆమెలో అంతులేని చైతన్యాన్ని నింపి సమర శంఖం పూరిస్తున్నాడు. గత గాయాలను గేయాలుగా, వర్తమానాన్ని ఆర్తనాదాలుగా, భవితను బంగారు కవితగా వినిపిస్తున్నారు. పనిలో పనిగా పాత్రధారులు జనంలోకి వచ్చి పల్స్ రేటును పట్టి చూస్తున్నారు. ఎక్కడ నటనను ఎలా పండించాలో నేర్చుకుంటున్నారు.

ప్రేక్షకులు పాత్రలతో మమేకమై ఆడుతున్నారు. పాడుతున్నారు. ఏడుస్తున్నారు. దర్శకుడికి ప్రేక్షకులకు మధ్య ఇనుప తెరలతో బహుముఖాలుగా ఆమె పాత్ర.

ఉత్కంఠ రేగుతోంది. తీవ్రత తట్టుకోలేక ప్రేక్షకులు కొట్టుకుంటున్నారు. పాత్రమీద అఖండ సానుభూతితో ఆత్మత్యాగం చేసుకుంటున్నారు.

స్పాన్సర్లకు బోలెడు పబ్లిసిటీ. దర్శకుడికి లెక్కలేనన్ని ఆఫర్లు. నిర్మాతకు డబ్బులే డబ్బులు. పాత్రధారులకు అవార్డులు,రివార్డులు. సీరియల్‌ను ఏ మలుపులు తిప్పాలో, ఎలా కొనసాగించాలో తర్జనభర్జనలు పడతున్నారు.

**ఎపిసోడ్-7**

గదిలో ఆమె బానిసలా బతుకుతోంది. వాళ్లు విదిలించే పిడికెడు మెతుకుల కోసం ఆమె ఆశగా ఎదురుచూస్తోంది.ప్రేక్షకులు ఆక్రోశిస్తున్నారు. దర్శకుడు కోరుకున్న దానికంటే ఎక్కువగా ఆందోళన పడుతున్నారు. ఆ విషయం నిర్మాతతో చెప్పి రెమ్యునరేషన్ పెంచుకున్నాడు దర్శకుడు.

''నాకు విముక్తి కావాలి' ఆమె గర్జించింది.

''ఇస్తే పోలా...''కొడుకు అన్నాడు

''నీ మొహం ఇచ్చి ఏం చేస్తావ్?..ఇస్తే మాత్రం ఊరుకుంటుందా? కాజేసిన సొమ్మంతా రాబట్టదూ? ఇలా పడి ఉండాల్సిందే'' అంది అత్త. కొడుకు బుర్ర గోక్కుంటూ ''అవును నిజమే'' అన్నాడు.

ఆమె అన్యాయమని ఆక్రోశిస్తోంది. అలవాటుగా బ్రేక్ పడింది. తిరిగి ఓపెన్‌లో.. ఇంట్లో కొందరు పెద్దలున్నారు. ఆమెకు న్యాయంచేస్తామంటున్నారు.

అత్తగారు పెద్దలను ఆహ్వానించింది.మామగారు మర్యాద చేశారు. భర్త పెద్దలను ఇల్లంతా తిప్పి చూపాడు. ఆమె కళ్లల్లోంచి రక్తం ఒలుకుతోంది. తర్జనభర్జనలు. వాడి వేడి చర్చలు. పెద్దలు నిర్ణయం చెప్పే లోపు చిన్న బ్రేక్.

రీఓపెన్‌లో ఇల్లంతా మెరిసిపోతోంది. ప్రేక్షకులంతా ఎంతో ఆశతో పెద్దల నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. పెద్దలు వక్కపొడి నములుతూ తీరిగ్గా నిర్ణయం చెప్పారు.

''ఇల్లు బాగుంది. మంచి భర్త. కన్నకూతురిలా చూసుకునే అత్తమామలు. ఇకేం కావాలి? కాపురం కూల్చుకోకు'' అని.

చూస్తున్న జనం గుండెలు మండుతున్నాయి. ఆవేశం రగులుతోంది. అసలు రంగు అది కాదని అరుస్తున్నారు. వాళ్ల మాటలు విద్యుత్ అయస్కాంత తరంగాలుగా మారలేక పోతున్నాయి. ఆవేశం ఆవిరై కాళ్లు భూమిలోకి కుంగిపోతున్నాయి.

స్పాన్సర్‌కు సంతోషం. డైరెక్టర్‌కు పేరుప్రతిష్ఠలు. నిర్మాతకు లాభం. పాత్రను అడ్డంపెట్టుకుని ప్రజలను ఆడిస్తున్నారు.

**ఎపిసోడ్-8**

పాత్ర మాయమయింది. అంతా అయోమయం. స్క్రీన్ కదలడంలేదు. అందరిలో ఉత్కంఠ. తొలకరి జల్లుకు విత్తనం పురుడు పోసుకున్నట్టు..అంతటా విస్తరించిన గడ్డి పరకల్లా జనం. సముద్రంలో నీటి చుక్కలు గడ్డకట్టినట్టు.

స్క్రీన్ మీద మాయమైన పాత్ర జనంలో తేలింది. డైరెక్టర్‌కి జనానికి మధ్య ఉన్న తెర తొలగి పోయింది. ఇప్పుడు వాళ్లు జనానికి ఎదురుగా స్పష్టంగా కనిపిస్తున్నారు.

కోట్ల జనం గొంతులో ఇప్పుడు రణ నినాదమై ఆమె.

*

రచయిత సెల్ నెం: 9441672428

